



కాళేశ్వర ముక్తీశ్వరుడికి అభిషేకం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ దంపతులు



పుష్కర ఘాట్‌కు వెళ్లే దారిలో భక్తుల రద్దీ

- కిక్కిరిసిన కాళేశ్వర ముక్తీశ్వరాలయం
- 11వ రోజు 3.50 లక్షల మంది పుణ్యస్నానాలు
- కొనసాగిన ట్రాఫిక్.. ఇబ్బందులు పడ్డ భక్తులు
- పుణ్యస్నానమాచరించిన గవర్నర్ దంపతులు
- నేటితో ముగియనున్న సరస్వతీ పుష్కరాలు

భక్తజన ప్రవాహం

7

పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

పుష్కర స్నానాలతో భక్తులు పులకించిపోయారు. కనీవినీ ఎరుగని రీతిలో సరస్వతి పుష్కరాలకు భక్తులు బారులు తీరారు. ఆదివారం 11వ రోజు పుణ్యసానాలు ఆచరించడానికి వచ్చిన భక్తజన సందోహంతో కాళేశ్వర క్షేత్రం కళకళలాడింది. స్నానమాచరించే ఘాట్లతో పాటు ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తడంతో ఘాట్లతో పాటు కాళేశ్వర వీధులన్నీ జనమయమయ్యాయి. సుమారు 3.50లక్షల మంది హాజరైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. కాగా, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పుష్కరాలకు హాజరయ్యారు. పుష్కర స్నానమాచరించి ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అలాగే ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి, మహారాష్ట్ర ఎంపీ నామ్‌దేవ్‌రావు, ఎమ్మెల్సీ సురభివాణీ పుష్కరాలకు వచ్చారు. అయితే సరస్వతి పుష్కరాలు సోమవారంతో ముగియనున్నాయి. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీతో పరిసమాప్తి కానున్నాయి.

- కాళేశ్వరం (ఆంధ్రజ్యోతి)



పుష్కరిణికి నమస్కరిస్తున్న యువతి



కాళేశ్వరం దారిలో భారీగా బారులు తీరిన వాహనాలు



కాళేశ్వరంలో పుష్కర స్నానం చేస్తున్న భక్తులు

సంస్కారవంత సమాజం కోసమే ప్రజ్ఞ

- వేసవి శిబిర ముగింపు వేడుకల్లో చినజీయర్‌స్వామి ఉద్బోధ
- 3 గంటల పాటు ఉల్లాసంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

హనుమకొండ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): సంస్కారవంతమైన సమాజంతోపాటు ధార్మిక విలువలతో విద్యార్థులు చైతన్యవంతం అయ్యేందుకు ప్రజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వేద విశ్వవిద్యాలయ స్థాపకుడు శ్రీరామానుజ చిన్న జీయర్ స్వామి ఉద్బోధించారు. హనుమకొండ, వరంగల్ వికాసం తరంగిణి శాఖల ఆధ్వర్యంలో నాలుగు వారాలుగా నిర్వహిస్తున్నట్లు ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిర ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి హనుమకొండలోని టీడీడీ కల్యాణ మండపంలో నేత్రపర్వంగా నిర్వహించారు. వికాస తరంగిణి ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకల్లో హైదరాబాద్ నుంచి చిన్న జీయర్‌స్వామి హాజరయ్యారు. విద్యార్థుల ప్రజ్ఞా పాఠవాలను తెలుసుకుని ప్రత్యేక మంగళశాసనాలు అందించారు. ధార్మిక భావజాలంపై అధ్యాత్మిక పునాదులతో సమాజసేవ సంస్కారం, నీతి, ధార్మిక విలువలను తెలియజేప్పేందుకు తెలుగు రాష్ట్రాల్లోని వికాస తరంగిణిలు ప్రజ్ఞ పేరిట వేసవి శిబిరాలను నిర్వహింపచేశామని అన్నారు. ఇందులో భాగంగా వరంగల్ నగరంలో 130 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనడం విశేషమని నిర్వాహకులను జీయర్‌స్వామి అభినందించారు.



ఆడియో ద్వారా విద్యార్థులకు మంగళ శాసనాలు అందచేస్తున్న చినజీయర్ స్వామి

ఇక్కడ నేర్చుకున్న ప్రతీ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేప్పి సమాజంలో ధార్మిక విలువల కోసం విద్యార్థులు పాటుపడాలని తెలియజెప్పారు. ఈ సందర్భంగా జై శ్రీమన్నారాయణ నినాదాలతో టీడీడీ హాలు ప్రతినిధ్వనించింది.

అంతకు ముందు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ.. ఈ దఫా మొత్తం 10 అంశాలతో 15 ఏళ్లలోపు పిల్లలకు ప్రజ్ఞ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. భగవద్గీత శ్లోకాలు, భజనలు అన్నమాచార్య కీర్తనలు, కోలాటం, యోగా, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ లాంటి అంశాలలో ప్రజ్ఞ ఇన్‌చార్జి తనుజాదయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ వికాస తరంగిణి వైద్యశిబిరాల ఇన్‌చార్జి డాక్టర్ వీణ, హైదరాబాద్ వికాస తరంగిణి ఇన్‌చార్జి అరుణ్‌కుమార్, వరంగల్ వికాసతరంగిణి ఉపాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, నాగార్జున డైరెక్టర్ వెంకటేశ్వర్లు, యోగా మాస్టర్ పారంకుశం దయాకర్, శిబిర నిర్వాహకులు వసంత, తిరుమల్, ఉమా, వనజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 3గంటల పాటు పెద్దసంఖ్యలో పాల్గొన్న తల్లిదండ్రుల ఆధ్వర్యంలో విద్యార్థులు తాము నేర్చుకున్న ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, టీటీడీ ప్రచురించిన మానవులందరికీ భగవద్గీత పుస్తకాలను బహూకరించారు.

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

- కమిటీ చైర్మన్ అశోక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రవీందర్, అశోక్

ములుగు, మే 25 (ఆంధ్రజ్యోతి): జీవితం ఉన్నది జీవించడానికని.. ఆత్మహత్య చేసుకోవడానికి కాదని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో డీఎస్పీ రవీందర్‌తో కలిసి ఆత్మహత్యల నివారణపై రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మనిషి చావును కాదు.. రేవును చేరుకోవాలన్నారు. వైఫల్యాన్ని వెక్కిరించి అఘాయిత్యాల ఆలోచన మరిచి నిలిచి గెలిస్తేనే సంపూర్ణ జీవితముంటుందన్నారు. బలవన్మరణాల బలిపీఠం భారత్ కాకూడదన్నారు. ఆత్మహత్యకు పాల్పడే వారికి మేమున్నామంటూ భరోసా కల్పించాలని అన్నారు. కష్టాలలో ఉన్న వ్యక్తి తనకున్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్యకు పాల్పడుతారని, అలాంటి వారిని గుర్తించి మానసిక ధైర్యాన్ని కల్పించాలన్నారు. అనంతరం డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలలో 28 మంది జీవితాలను కాపాడిందన్నారు. కార్యక్రమంలో బీసీ జాక్ అధ్యక్షుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల ప్రజలు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి దేవతల గద్దెలకు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లులకు తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం దేవతల నామస్మరణలతో వనదేవతల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించి పూజారులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, సుమారు 10వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఇక ఎక్కడైనా 'స్లాట్ బుకింగ్'

- జూన్ 2 నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- ఇప్పటికే 6 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విజయవంతం
- ఉమ్మడి జిల్లాలోని మిగతా 7 కార్యాలయాల్లో ఏర్పాట్లు

6

నేటి నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,235 మంది ఎంపిక
- స్వయం ఉపాధేనా లేక గౌరవ వేతనమా?
- స్పష్టత లేక అయోమయం

కొంపెల్లిలో పిచ్చికుక్కల బీభత్సం

15 మందిపై విరుచుకుపడి కరిచిన కుక్కలు

కృష్ణకాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామంలో పిచ్చికుక్కలు బీభత్సం సృష్టించాయి. ఇంటి ముందర ఉన్న చిన్న, పెద్ద వారిపై విరుచుకుపడి కరిచాయి. ఆదివారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో పిచ్చికుక్కలు ఒకటినొకటి కరుచుకుంటూ ఇళ్లముందర ఉన్న వ్యక్తులపై పడి విచక్షణ రహితంగా కరిచాయి. దీంతో గాయపడిన వారిని తొలుత వంద పడకల ఆసుపత్రికి తరలించారు. అధికంగా గాయపడిన నలుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, గత నాలుగు రోజుల కిందటే ఇదే గ్రామంలో ఐదుగురిని కుక్కలు కరిచి గాయపర్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో అందరం సమష్టిగా భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీ హనుమాన్‌నగర్, శాంతినగర్, లక్ష్మీనగర్‌లలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్ర నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యనారాయణరావు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. రాజ్యాంగ పరిరక్షణపై ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అణగదొక్కుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బట్టు కర్ణాకర్, ముంజాల రవీందర్, చల్ల రేణుక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మోడికుంటకు మోక్షం..

- ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- 2005 నుంచి పెండింగ్‌లోనే ప్రాజెక్టు పనులు
- ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నీటిపారుదల శాఖకు ఆదేశాలిచ్చిన ప్రభుత్వం



మోడికుంట ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం (ఫైల్)

వాజేడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రజల కలల ప్రాజెక్టు మోడికుంటకు మోక్షం కలిగింది. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని కృష్ణాపురం వద్ద ఉన్న మోడికుంట వాగుపై మధ్య తరహా ప్రాజెక్టును నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పచ్చజెండా ఊపింది. సవరించిన అంచనాలతో రూ.718 కోట్లతో ప్రాజెక్టును నిర్మించేందుకు పరిపాలనా పరమైన ఆదేశాలను ఇచ్చింది. నీటిపారుదల శాఖకు ఆదేశాలు ఇస్తూ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో గేట్లతో పాటు స్పిల్ వేను నిర్మించడం, 1,292 మీటర్ల ఆనకట్ట, 21.850 కిలోమీటర్ల పొడవున ప్రధాన కాలువ నిర్మాణానికి డిజైన్ చేశారు. 28.950 కిలోమీటర్ల విస్తీర్ణంలో 10 పిల్ల కాలువలను నిర్మించి దాదాపు 13,591 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఎట్టకేలకు రెండు దశాబ్దాలకు మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం పట్టాలు ఎక్కుతుండటంతో ఏజెన్సీ ప్రజల కల నెరవేరనుంది.

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏజెన్సీ ప్రజల చిరకాల ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందా.. లేదా.. అని ప్రజలు చర్చించుకున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంకు పచ్చజెండా ఊపింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో నిర్మించనున్న

మిగతా 8వ పేజీలో...



బచ్చన్నపేట సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా సజీవం

• కగార్‌తో మారణహోమం • సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ • గోపాల్‌నగర్‌లో గోపాల్‌రెడ్డి స్థూపం ఆవిష్కరణ

బచ్చన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా సజీవంగా ఉంటుందని, ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటుందని సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శి జగ్గుల జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం రాత్రి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని గోపాల్‌నగర్ గ్రామ చౌరస్తా వద్ద జన గామ తొలి ఎమ్మెల్యే గంగసాని గోపాల్‌రెడ్డి స్మారకార్థం నిర్మించిన స్థూపాన్ని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి.అబ్బాస్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి బచ్చన్నపేట చౌరస్తా వరకు ర్యాలీగా తరలివచ్చారు. అక్కడే ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. భూ పోరాటాలు చేసి పేదలకు భూమి పంచిన ఘనత గోపాల్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఎర్రజెండాతో పెట్టుకున్నవారు కాలగర్భంలో కలిసిపోయారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వెళుతోందన్నారు. అటవీ సంపదను ఆదానీ, అంబానీలకు దోచిపెట్టాలనే దురుద్దేశంతోనే ఆపరేషన్ కగార్ చేపట్టి ఆదివాసీలను, గిరిజనులను చంపుతోందని ఆరోపించారు. వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి, ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా నాయకులు రాపర్తి రాజు, బొట్ల శేఖర్, సుంచు విజేందర్, ఇర్రి అహల్య, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు, వివిధ గ్రామాల సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు..

నేలలో కలియదున్నితే లాభాలు.. అన్నదాతలు ఆలోచించండి

వర్ధన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన తరువాత వరి కొయ్యలను కాల్చడం వలన పొలంలో చేరిన కీటకాలు వ్యాధి కారక సూక్ష్మ జీవులు నశిస్తాయని రైతులు అభిప్రాయపడుతుంటారని, అలా చేయడం వలన పర్యావరణ కాలుష్యంతో పాటు భూసారాన్ని పెంచే సూక్ష్మ జీవులు నశిస్తాయని వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి అంటున్నారు. వరి కొయ్యలను నేలలో కలియ దున్నితే ఎన్నో లాభాలు ఉంటాయని ఆయన పేర్కొంటున్నారు.

ఉపయోగాలు

కలియదున్నడంతో వరి కొయ్యలు మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది. నత్రజని, భాస్వరం, సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి. సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. భూసారం పెరిగితే ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు. వానపాములు పెరిగి భూమి సారవంతం అవుతుంది. నేల కోతకు గురికాకుండా ఉంటుంది. భూమికి నీటిని పోషకాలను నిలువ ఉంచే గుణం పెంచుతుంది. వరిగడ్డి మొదళ్లు పశువులకు మేతగా ఉపయోగపడుతుంది.

నష్టాలు

వరి కొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుంది. తేమను కలిగి ఉండే మట్టి తన సహజ గుణాన్ని కోల్పోతుంది. నేలలో సహజ సిద్ధంగా ఉండే సూక్ష్మ జీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి. నత్రజనిలాంటి పోషక పదార్థాలు క్షీణిస్తాయి. కొన్నేళ్లుగా భూసారం అంతా తగ్గిపోవడంతో సాగుకు పనికి రాకుండా పోతుంది. వరి, గడ్డి ఇతర పంటల వ్యర్థాలను కాల్చడం వలన వాతావరణంలో కార్బన్‌డైయాక్సైడ్, కార్బన్‌మోనాక్సైడ్ తదితర వాయువులు విడుదలై వాయు కాలుష్యానికి కారణం అవుతాయి. మంటలు పెద్దవైతే పక్క రైతుల పంటలు దెబ్బ తినడంతో పాటు ఇతర వస్తువులు కాలిపోయే ప్రమాదం ఉంది. గడ్డిని కాల్చివేయడం వలన పంటలో కలుపు తగ్గుతుందని భావిస్తుంటారు. కలుపు మొక్కలే కాదు వరి కుడా సరిగా పెరగదు.

ఇలా చేయాలి..

పొలాన్ని రోటవేటర్‌తో కలియ దున్నాలి. దీంతో వరి కొయ్యలు చిన్న ముక్కలుగా మారుతాయి. దుక్కికి నీళ్లుపెట్టి ఎకరానికి 50కిలోల సింగిల్ సూపర్ పాస్పెట్ వేసి 15నుంచి 20రోజులు పొలాన్ని నానబెట్టాలి. కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతాయి. నత్రజని, భాస్వరం సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి. సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది.

ఇక ఎక్కడైనా 'స్లాట్ బుకింగ్'

హనుమకొండటౌన్, మే25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విజయవంతం కావడంతో జూన్ నెల 2న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 7సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వం నుంచి అదేశాలు రాగానే భూపాలపల్లి, పరకాల, భీమదేవరపల్లి, కొడకండ్ల, ములుగు, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలులోకి రానుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని అధికారులు సంబంధించిన సాంకేతిక మార్పుల్లో నిమగ్నమవుతున్నారు. స్లాట్ బుకింగ్ విధానంతో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

పారదర్శత కోసమే..

2025 మార్చి నెలలో హైదరాబాద్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖపై రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆస్తుల క్రయ, విక్రయదారుల డాక్యుమెట్ల రిజిస్ట్రేషన్‌కు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆధునీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించింది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల క్రయ, విక్రయదారులకు పారదర్శకంగా, అవినీతిరహితంగా మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన స్లాట్ బుకింగ్‌తోపాటు, బయోమెట్రిక్ విధానాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్లాట్ బుకింగ్ లేని కార్యాలయాల్లో ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీసం అరగంట నుంచి గంట వరకు సమయం పడుతోంది. అదే స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి వచ్చిన హనుమకొండ, ఖిలా వరంగల్, వరంగల్‌రూరల్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతోంది.



- జూన్ 2 నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- ఇప్పటికే 6 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విజయవంతం
- 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి, పారదర్శకంగా సేవలు
- ఉమ్మడి జిల్లాలోని మిగతా 7 కార్యాలయాల్లో ఏర్పాట్లు

మరో 7 ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

డి.ఫణిందర్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఇప్పటికే 6 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌బుకింగ్ విధానం ప్రవేశపెట్టాం. దీంతో మరో 7 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి వస్తుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మిగతాచోట్ల అమలు చేస్తాం.

విజయవంతం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా వరంగల్ రూరల్, ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎంపిక చేశారు. రెండో విడతలో హనుమకొండ, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎంపిక చేసి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో మిగిలిన 7 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో త్వరలోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిషేధిత జాబితాలోని ఆస్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా నిషేధిత జాబితా స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా తెలిసేలా వ్యవస్థను ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నూతన స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ సులభతరమవుతుందని, ఉదయం 10:30 నుంచి 1:30 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకుని, స్లాట్ బుకింగ్ తరువాత లాగిన్‌లో, డిపార్ట్‌మెంట్ పోర్టల్‌లో పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్లాట్‌బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను స్కాన్‌చేసి అదే రోజున సంబంధిత ఆస్తుల కొనుగోలుదారులకు ఇస్తారు.

స్లాట్ బుకింగ్ రోజే రిజిస్ట్రేషన్

స్లాట్ బుకింగ్ తక్కువైన రోజు వెంటనే స్లాట్ బుకింగ్ చేసుకుని, 5గంటల లోపు వస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఏదైనా కారణంతో పెండింగ్‌లో పడితే దానికి కారణాలను అధికారులు వివరిస్తారు. పారదర్శకంగా వేగవంతంగా స్లాట్ బుకింగ్‌ను ఉపయోగించుకునేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

కాజీపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా పి.వెంకన్న



వరంగల్ క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా పి.వెంకన్న నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న పాటి నాగబాబును భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు సీఐగా మల్టీజోన్- 1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం నియమించింది తెలిసిందే. కాగా, ఆయన స్థానంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకన్నను నియమించారు.

ఫార్మసీలో సమతకు డాక్టరేట్ ప్రదానం



కేయూ క్యాంపస్ మే 25, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధకురాలు ఏంపటి సమతకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సమతకు డాక్టరేట్ ప్రకటించారు. 'ఏ ప్రాస్పెక్టివ్ స్టడీ ఆన్ రోల్ ఆఫ్ మెట్‌పార్మిన్ అండ్ మయో ఆయోనిసిటాల్ ఇన్ మేనేజ్‌మెంట్ ఆఫ్ పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కాజీపేట విష్ణుపురి ప్రాంతానికి చెందిన సమత 12 అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలను ప్రచురించారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన సమతను పలువురు అభినందించారు.

లారీ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

మడికొండ, మే 25(ఆంధ్రజ్యోతి): లారీ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన ఘటన కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్ప వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మడికొండ ఇన్స్‌పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గు లోడ్‌తో వరంగల్ నుంచి కాజీపేట వైపునకు వెళ్తున్న లారీ కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్ప వద్దకు రాగానే టైర్ పేలి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన డ్రైవర్ అభిషేక్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సందడిగా జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

హాజరైన 250మంది అథ్లెట్లు

వరంగల్‌స్పోర్ట్స్, మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఆదివారం జేఎన్ఎస్‌లోని అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి అండర్-8, 10, 12 బాలబాలికల విభాగంలో 60, 100, 300, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, స్టాండింగ్ షాట్‌పుట్, జావెలిన్‌త్రో, టెన్నిస్‌బాల్‌త్రోలో నిర్వహించిన పోటీల్లో 250మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 1వ తేదీన సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, పీడీలు వాసు, రజినీ, కోచ్ శ్రీమన్నారాయణ, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నేటి నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

• ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,235 మంది ఎంపిక • స్వయం ఉపాధేనా లేక గౌరవ వేతనమా? • స్పష్టత లేక అయోమయం



హనుమకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా చేపట్టిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల తొలి విడత నియామక ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,235 మంది అభ్యర్థులు మొదటి విడతలో ఎంపికయ్యారు. వీరిలో వరంగల్ జిల్లాలో 315మంది, హనుమకొండ జిల్లాలో 313 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 88 మంది, మహబూబాబాద్ జిల్లాలో 203 మంది, ములుగు జిల్లాలో 91 మంది, జనగామ జిల్లాలో 225 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థుల పేర్ల జాబితాలను భూకొలతల శాఖ విడుదల చేసింది. ఈనెల 26నుంచి అభ్యర్థులకు జిల్లా కేంద్రాల్లోనే 50రోజుల పాటు వీరికి శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మలివిడతలో ఎంపికైన వారు పోగా మిగిలిన అభ్యర్థులకు కూడా తర్వాత శిక్షణ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

భూవివాదాల పరిష్కారానికి..

భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి రిజిస్ట్రేషన్ల సమయంలో భూ నక్షా (పటం) సమర్పించాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. ప్రభుత్వ సర్వేయర్ల కొరత వల్ల ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం జిల్లాల వారీగా ఈనెల 17 వరకు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హతను బట్టి 50 శాతానికిపైగా ఎంపిక చేసిన ప్రభుత్వం.. మలివిడతలో మిగిలిన వారికి శిక్షణ ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, మొదట్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని తెలంగాణ సర్వే ట్రైనింగ్ అకాడమీలో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. తాజాగా జిల్లా కేంద్రంలోనే శిక్షణకు ఏర్పాట్లు చేస్తుండడంతో వారిలో హర్షం వ్యక్తం అవుతోంది. ఎంపికైన అభ్యర్థులు నిజ ధ్రువపత్రాలతో పాటు మీ సేవా కేంద్రంలో దరఖాస్తుకు జత చేసిన ధ్రువపత్రాలను ఒక జత వెంట తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు.

సర్వేవిభాగం బలోపేతం

భూముల పంచాయతీలకు శాశ్వత పరిష్కారం కోసమే సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్‌రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌ను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే పటాన్ని జతపరడం తప్పనిసరి చేసింది. దీంతో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుంది. భూ భారతి చట్టంలో పేర్కొన్నట్టు ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 402మంది ప్రభుత్వ సర్వేయర్లు సరిపోరు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒకవైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీ ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీచేయడం, ఇంకో వైపు భూముల సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికారలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాన్ని చేపట్టింది.

ఈనెల 26 నుంచి శిక్షణ

అభ్యర్థులకు ఈనెల 26 నుంచి 50 పని దినాల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. హనుమకొండ జిల్లా అభ్యర్థులకు హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో, వరంగల్ జిల్లా అభ్యర్థులకు దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో శిక్షణ ఇస్తారు. శిక్షణ ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. హనుమకొండ జిల్లా అభ్యర్థులు ఈనెల 26న ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, అభ్యర్థులు ధృవీకరణ పత్రాలతోపాటు మీసేవా కేంద్రంలో దరఖాస్తుకు జత చేసిన ధ్రువపత్రాలను ఒక జత వెంట తీసుకురావాలని హనుమకొండ జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు కోరారు.

స్వయం ఉపాధేనా..?

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు వేతనం విషయంలో స్పష్టత లేదు. ఇది వారికి స్వయం ఉపాధి కల్పించడానికి మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. ఎంపికైనవారికి ప్రస్తుతం ఇచ్చేది శిక్షణ మాత్రమే. ఆ తర్వాత అప్రెంటిషిప్ ఉంటుంది. అనంతరం పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులు అయినవారికి ల్యాండ్ అండ్ సర్వే కమిషనర్ అధీకృత లైసెన్సులు జారీ చేస్తారు. ఇలా లైసెన్సులు పొందిన సర్వేయర్లను ప్రభుత్వం అవసరాన్ని బట్టి వినియోగించుకుంటుంది. ప్రస్తుతానికి ప్రతీ మండలానికి గరిష్ఠంగా 6 నుంచి 8 మందిని ఎంపిక చేశారు. వీరు మండల సర్వేయర్ పరిధిలో పని చేయాల్సి ఉంటుంది. ఎంపికైన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు భూ సర్వే చేయడానికి అవసరమైన పరికరాలను ఎవరు సమకూరుస్తారనే విషయంలో స్పష్టత లేదు. భూ కొలతలకు ఇటీవల కాలంలో అత్యాధునికమైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ఖరీదు రూ.లక్షల్లో ఉంది. వీటిని లైసెన్స్‌డ్ సర్వేయర్లు కొనగలరా అన్నది సందేహమే. ఆర్థిక స్థోమత లేనివారి పరిస్థితి ఏమిటన్నదానిపై చర్చ జరుగుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవలసి ఉంది. నిర్ణీత వేతనం చెల్లిస్తారా? లేక చేసిన సర్వేపనిని బట్టి చెల్లింపులు ఉంటాయా..? అన్నది కూడా స్పష్టం కావలసి ఉంది.

ఐదు రోజులుగా అదే నిరీక్షణ

రాకేష్ మృతదేహం కోసం బంధువుల నరకయాతన • పట్టించుకోని నారాయణపూర్ పోలీసులు

హసన్‌పర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నాలుగు రోజుల కిందట మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత కేశవరావు అలియాస్ బసవరాజ్ కంప్యూటర్ ఆపరేటర్ బూర రాకేష్ (32) మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఐదు రోజులుగా ఎదురు చూస్తున్నారు. ప్రాంతం కానీ ప్రాంతంలో తిండి తిప్పలు మరిచి రాకేష్ మృతదేహాన్ని అప్పగించాలని కోరుతూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఓ వైపు రాకేష్ మృతదేహం డీకంపోజ్ అవుతున్నప్పటికీ ఇటు పోలీసులు, అటు ప్రభుత్వ పాలకులు ఏవిధమైన నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రజాసంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన పార్థీవదేహాల అప్పగింతలో కొంత పారదర్శకత లేకపోవడంతో మృతుడి కుటుంబ సభ్యులు కడుపుకోతకు గురవుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన మావోయిస్టుల మృతదేహాలను అప్పగించకపోవడంలో పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక్క తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన మావోయిస్టు పార్థీవదేహాలు తప్ప మిగతా ఏ రాష్ట్రాలకు చెందిన మృతదేహాలు కూడా నారాయణపూర్ పోలీసు లైన్‌లో లేకపోవడంతో మృతుడి తల్లిదండ్రులు బూర బాబు-స్వరూప దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రజా ఉద్యమపోరాటంలో అసువులు బాసిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించి అంత్యక్రియల నిర్వహణకు సహకరించాలని అమరవీరుల బంధువుల కమిటీ సభ్యులు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గురువారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు రాకేష్ మృతదేహాన్ని అప్పగించాలని హ్యూమన్ రైట్స్ లాయర్ రైటర్ అడ్వకేట్ బేల బాటియాతో కలిసి నారాయణపూర్ పోలీసులను కోరారు. అక్కడి పోలీసులు రేపు మాపు అంటూ ఇప్పటికి ఐదురోజులుగా మృతుడి కుటుంబ సభ్యులను తిప్పించుకోవడంతో పుట్టెడుదుఃఖంతో కుమిలిపోతున్నారు. తమ కుమారుడిని చివరి చూపు చూసుకొని అంత్య క్రియలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు.



చింతగట్టులో బంధువుల నిరీక్షణ

ఛత్తీస్‌గఢ్ మాడ్ అటవీ ప్రాంతంలో మృతి చెందిన బూర రాకేష్ మృతదేహం కోసం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజా సంఘాల నాయకులు, అమరుల బంధువుల కమిటీ సభ్యులు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టులోని వారి స్వగృహంలో ఎదురు చూస్తున్నారు. ఐదురోజులుగా రాకేష్ అలియాస్ వివేక్ చివరి చూపు కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులకు ఆదివారం కూడా నిరాశే మిగిలింది. ఆది వారం రాత్రి వరకు కూడా నారాయణపూర్ పోలీసులు రాకేష్ పార్థీవదేహాన్ని అప్పగించకపోవడంతో మృతుడి కుటుంబ సభ్యులు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు.

రైలు ఢీకొని ట్రాన్స్‌జెండర్ మృతి

పట్టాలు దాటుతుండగా ప్రమాదం



గిర్మాజీపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్ సమీపంలోని అబ్బనికుంట మైసమ్మ ఆలయం వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ట్రాన్స్‌జెండర్ ఐశ్వర్య అలియాస్ అశోక్‌కుమార్ (35) మృతిచెందినట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన మిరియాల అశోక్‌కుమార్ ఆర్నెళ్ల కిందట ట్రాన్స్‌జెండర్ ఐశ్వర్యగా మారి మహబూబాబాద్ మిలటరీ కాలనీలో నివసిస్తున్నట్లు సీఐ తెలిపారు. శనివారం సాయంత్రం వరంగల్‌కు వచ్చిన తల్లిని రైల్వేస్టేషన్‌లో కూర్చోపెట్టి ఐశ్వర్య అబ్బనికుంట మైసమ్మ దేవాలయం వైపు వెళ్తూ పట్టాలు దాటుతుండగా ఐశ్వర్యను రైలు ఢీకొనడంతో తల పగిలి తీవ్రంగా గాయపడినట్లు సీఐ తెలిపారు. ఐశ్వర్యను 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారని, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శనివారం అర్ధరాత్రి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఐశ్వర్య మృతి చెందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భక్తజన ప్రవాహం

11వ రోజు 3.50 లక్షల మంది పుణ్యస్నానాలు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- పుణ్యస్నానమాచరించిన గవర్నర్ దంపతులు
- నేటితో ముగియనున్న సరస్వతీ పుష్కరాలు



కిక్కిరిసిన కాళేశ్వరం దారులు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాలకు 11వ రోజు ఆదివారం భక్తజన తాకిడి అధికమైంది. పుష్కరాలు చివరి ఘట్టానికి చేరుకోవడంతోపాటు ఆదివారం సెలవు కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పుష్కరస్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య యథావిధిగానే పునరావృతమైంది. తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్లు, ముక్తీశ్వరాలయం వరకు భక్తులు దర్శనాల కోసం అరిగోస పడ్డారు. పెరిగిన భక్తుల సంఖ్యకు తగ్గట్లుగా తాగునీరు, నీడ వసతి కల్పించలేకపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనం కోసం నిరీక్షించిన చాలా మంది భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ప్రముఖుల హాజరు

సర్వతీపుష్కరాలకు గవర్నర్ దంపతులతో సహా పలువురు హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు సరస్వతి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. సర స్వతి మాతకు చీరె, సారె సమర్పించారు. అక్కడి నుంచి కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి చేరుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ వేదపండితులు సంప్రదాయ బద్ధంగా గవర్నర్ దంపతులకు పరివట్టం, పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అలాగే, ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, మహారాష్ట్రలోని గడ్చిరోలి పార్లమెంట్ సభ్యుడు నామ్‌దేవ్ రావు, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పీవీ నర్సింహారావు కుమార్తె సురభి వాణీదేవి తన కుటుంబ సభ్యులు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజరామయ్యార్ తన కుమార్తె, కుమారుడితో కలిసి పుష్కర ఘాట్ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

ట్రాఫిక్ సమస్య తీవ్రం

పుష్కరాలకు వచ్చి వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తింది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు15 కిలోమీటర్ల నిడివిలో ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు ఆలస్యంగా తేరుకొని ఔట్ గోయింగ్ బస్సులు, కార్లను పూస్కుపల్లి మీదుగా మళ్లించినప్పటికీ అటు కూడా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకపోయారు. గంటలకొద్ది వాహనాలు కదలకపోవడంతో అందులో ప్రయాణిస్తున్న భక్తులు ఆకలి, దప్పికతో అలమటించి పోయారు. కాళేశ్వరం వచ్చి వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ సమస్య కారణంగా ఆర్టీసీ బస్సులు, కార్లలోనే గంటల తరబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8గంటలకు మహదేవపూర్ చేరుకున్న వాహనాలు సాయంత్రం 5 గంటల వరకు కూడా కాళేశ్వరానికి చేరుకోలేకపోవడంతో అనేక అవస్థలు పడ్డారు.

వీఐపీలు, బంధువుల సేవలపై ఫోకస్

దర్శనానికి వచ్చే సామాన్య భక్తులపై పోలీసు, దేవాదాయ శాఖ అధికారుల తీరు విమర్శలకు తావిచ్చింది. వారికి తెలిసిన వ్యక్తులు, బంధువులతో సేవలపైనే ప్రధానంగా వారు ఫోకస్ చేశారు. మండుటెండలో భక్తులు బారులు తీరి ఉన్నా పట్టించుకోకుండా వీఐపీలు, అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు దర్శనాలు చేయించడంలో తలమునకలయ్యారు. దీనికి తోడు క్యూలైన్లలో భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీస్ సిబ్బంది ఓవరాక్షన్‌తో సామాన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఒక దశలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద పోలీసుల తీరుతో ఓ మహిళా భక్తురాలు.. మహిళా ఎస్సైకి మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. ఓ దశలో ఒకరినొకరు దూషించుకునే పరిస్థితి ఏర్పడగా అక్కడే ఉన్న పోలీసు అధికారులు సముదాయించి ఇరువురిని పంపించారు.

నేడే చివరి ఘట్టం

సరస్వతి పుష్కరాల చివరి ఘట్టం సోమవారంతో ముగియనుంది. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీతో 12 రోజులతో పరిసమాప్తి కానుంది. చివరి రోజు శివయ్యకు అత్యంత ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో భక్తులు మరింత భారీగా తరలివచ్చే అవకాశాలున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. పుష్కరాల ముగింపుతో పాటు సోమవారం కానుండగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే అవకాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు. ఆదివారమే చాలా మంది కాళేశ్వర క్షేత్రానికి చేరుకున్నారు. ఇక్కడ బస చేసి సోమవారం దర్శించుకునేలా కార్యాచరణను రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.

అధికారుల అలసత్వంపై మంత్రి ఫైర్

ట్రాఫిక్‌ను చక్కబెట్టడంలో అధికారులు అలసత్వం వహించారనే విమర్శలు భక్తుల నుంచి బహిరంగంగానే వినవచ్చాయి. పోలీసు అధికారుల చర్యలు సరిగ్గా లేవని చాలా మంది భక్తజనం అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. స్వయంగా జిల్లా పోలీస్‌బాస్‌తో పాటు అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ జామ్, వాహనాల అస్తవ్యస్తంపై ఆయన మండిపడ్డారు. వన్‌వే చేయకుండా నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించగా.. వన్‌వే మూలంగా సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు బదులిచ్చారు. దీంతో స్వయంగా మ్యాప్ ద్వారా ట్రాఫిక్‌ను ఎలా నియంత్రించాలనే విషయంపై మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులకు దిశానిర్దేశం చేశారు.





హారతి ఇస్తున్న కాశీ పండితులు

వైభవంగా నవరత్నమాల హారతి

తిలకించిన మంత్రి సీతక్క ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని 11వ రోజైన ఆదివారం రాత్రి 7.00 గంటల నుంచి 7.45 గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో పలు అష్టకాలతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సీఎంవో కార్యదర్శి శ్రీనివాసరాజు, వందలాది మంది భక్తుల సమక్షంలో కనుల పండువగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ పురష్కర పుణ్య గడియలు ప్రజలందరికీ శ్రేయస్సును, శుభాన్ని కలిగించాలన్నారు. సరస్వతి మాత అమ్మవారి కృపతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలని ప్రత్యేకంగా పూజలు చేసినట్లు తెలిపారు. పుష్కరాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ నవరత్నమాల హారతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, రాష్ట్ర గెజిటెడ్ సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు పలు శాఖల అధికారులు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు వందలాది మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తిలకిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ వంశీ, ఎమ్మెల్యే సత్యనారాయణ

పుష్కర స్నానాలకు వెళ్తూ..
అనంత లోకాలకు..

కాటారం శివారులో 353(సీ) జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఎదురెదురుగా కార్లు ఢీ.. ఒకరి మృతి, 13 మందికి గాయాలు
- పుష్కరాలకు వెళ్తున్న వాహనాన్ని తిరిగొస్తున్న కారు ఢీకొన్న వైనం
- నుజ్జునుజ్జయిన రెండు వాహనాలు
- జేసీబీ సాయంతో క్షతగాత్రులను బయటకు తీసిన ప్రజలు
- హృదయ విదారకంగా ప్రమాద ఘటనా స్థలం



నుజ్జునుజ్జయిన తవేరా వాహనం



లలిత మృతదేహం

కాటారం, మే 25 (ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు వెళ్లి పుణ్యస్నానం చేద్దామని హైదరాబాద్ నుంచి బయలుదేరి కాళేశ్వరం వెళ్తున్న వారికి పుణ్యస్నానం చేసి వచ్చే వారి కారు మృత్యు శకటమైంది. రెండు కుటుంబాలకు చెందిన 10 మంది 250 కిలోమీటర్ల దూరం నుంచి హాయిగా మాట ముచ్చట చెప్పుకుంటూ ఆహ్లాదకరంగా ఉన్న అటవీ ప్రాంతంలోకి వచ్చిన కారును ఎదురుగా వేగంగా దూసుకువస్తున్న మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా, రెండు వాహనాల్లోని 13 మంది గాయాలపాలైన విషాద సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో 353(సీ) జాతీయ రహదారిపై కాటారం మండల కేంద్రం శివారులో ఆదివారం చోటుచేసుకుంది. కాటారం ఎస్సై మ్యాక అభినవ్, ఎస్‌హెచ్‌వో గీతారాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం..


సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన గెల్లి లక్ష్మీనర్సింహారావు కియా కారులో భార్య లక్ష్మీప్రసన్న, కుమార్తెలు ధనలక్ష్మి, నందిని, తేజస్వినితో కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వచ్చి పుణ్యస్నానం చేశారు. అనంతరం తిరిగి కాటారం మీదుగా మేడారం వెళ్లడానికి బయలుదేరారు. హైదరాబాద్ బాలాపూర్ క్రాస్ రోడ్డు త్రివేణినగర్‌కు చెందిన సకోటే కిషన్‌లాల్, కాడికె దుర్గాజీలతో పాటు వారి కుటుంబసభ్యులు టవేరా వాహనంలో పుష్కర స్నానం చేసివద్దామని కాళేశ్వరం వెళ్తున్నారు. కాటారం మండల కేంద్రం శివారులో అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద కాళేశ్వరం నుంచి వస్తున్న కియా కారు వేగంగా ఎదురుగా వస్తున్న టవేరా వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో టవేరా ధ్వంసమై డోర్స్ లోపలికి చొచ్చుకుపోవడంతో వాహనంలో ఉన్న సకోటే లలిత(61) తీవ్ర గాయాలతో మృతి చెందారు. సకోటే కిషన్‌లాల్, రాకేష్, సాయినంద, కాడికే దుర్గాజీ, పద్మ, సాయిప్రియ, రేణుక, నర్మద, డ్రైవర్ మల్లేష్ గాయపడ్డారు. వీరిలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా పరిస్థితి విషమంగా ఉంది. టవేరా ముందు భాగం ధ్వంసం కావడంతో గాయపడ్డవారు బయటికి రాలేని పరిస్థితి తలెత్తింది. దీంతో అక్కడే అన్నదాన శిబిరం వద్ద ఉన్న మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు ఆత్మకూరి కుమార్, భూపెల్లి రాజు, కొట్టె శ్రీశైలం, శ్రీహరి, అశోక్, పోలీసులు, స్థానికులు జేసీబీ సాయంతో కారు ముందు భాగాన్ని విడగొట్టి గాయాలతో ఉన్నవారిని బయటకు తీసి 108 అంబులెన్స్‌ల్లో వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఢీకొన్న కారులోని లక్ష్మీనర్సింహారావుతో భార్య, పిల్లలు గాయపడగా భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాగా, ప్రమాద స్థలంలో మృతదేహం, క్షతగాత్రుల రోదనలు, ఢీకొన్న వాహనాలు తీవ్రంగా ధ్వంసమై భయాందోళనతో హృదయవిదారకంగా కనిపించింది. ప్రమాద సంఘటనను చూసి పలువురు కంటతడి పెట్టుకుని బాధితులకు సాయమందించారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్, పీఎస్సై గీత తెలిపారు.



కాలు విరిగిన వ్యక్తిని పోలీసు వాహనంలో పంపిస్తున్న ఎస్సై



పుష్కర ఘాట్‌కు వెళ్తున్న వాహనాలు





త్రివేణి సంగమంలో..

నేటితో ముగియనున్న సరస్వతి పుష్కరాలు

సాయంత్రం 7.45 గంటలకు పరిసమాప్తం

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద అంతర్వాహిని సరస్వతి నదిమా తల్లికి నిర్వహించే పుష్కరాలు సోమవారంతో ముగియనున్నాయి. రాత్రి 7.45 నిమిషాలకు నవరత్నమాల హారతీతో పరి సమాప్తం కానున్నాయి.

ఇలా ముగియనున్నాయి

- సాయంత్రం 6 గంటలకు వేద స్వాస్తీ కార్యక్రమం
- 6.05 గంటలకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసంగం
- 6.10 గంటలకు సరస్వతి పుష్కరాలపై బ్రహ్మశ్రీ నాగ ఫణీశర్మ సందేశం
- 6.30 గంటలకు మంత్రులు, ప్రముఖల ప్రసంగం
- రాత్రి 7 నుంచి 7.45 గంటల వరకు నవరత్నమాల హారతి కార్యక్రమం
- 7.46 గంటలకు డ్రోన్ షో
- 7.55గంటల నుంచి 8.10గంటల వరకు బాణాసంచా ప్రదర్శనతో ముగియనున్న పుష్కరోత్సవాలు



ప్రధాన ఆలయం పూలు వాడిపోయి అంధవికారంగా ఉన్న దృశ్యం

ప్రముఖులు వస్తేనే ముస్తాబా..?

- ముక్తీశ్వరాలయ ముస్తాబుపై విమర్శలు
- ప్రముఖుల పర్యటనలో మాత్రమే అధికారులు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాలకు ప్రధాన ఆకర్షణగా ఉన్న కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. పుష్కరాలు జరిగే 12 రోజుల పాటు స్వామి వారిని లక్షలాది మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్న సందర్భంలో ఆలయంను సర్వాంగ సుందరాంగ తీర్చిదిద్దాల్సిన అధికారులు ప్రముఖుల సేవలో తరిస్తున్నారు. పుష్కరాల మొదటి రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ సందర్శనకు వచ్చిన సందర్భంలో ఆలాయన్ని పూలతో అలంకరించిన అధికారులు మళ్లీ పుష్కరాలు 11 రోజైన ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన రోజు అలంకరించారు. దీంతో ఆలయ ఈవో వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుష్కరాలు జరిగే 12రోజుల పాటు ఆలయాన్ని ప్రతి రోజు పూలతో అలంకరించాల్సింది పోయి ప్రముఖుల పర్యటనలో మాత్రమే అలంకరించడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. భగవంతుడి ముందు అందరు సమానమనే చెప్పే ఆలయాధికారులు ప్రతి రోజు స్వామి వారి ఆలయాన్ని ఎందుకు అలంకరించలేదని ప్రశ్నిస్తున్నారు. పుష్కరాల చివరి రోజైన స్వామి వారి ఆలయంతో పాటు సరస్వతి మాత, శుభానందదేవి ఆలయాలనుపూలతోఅలంకరించాలని కోరుతున్నారు.

గవర్నర్ దంపతుల పుష్కర స్నానం



సరస్వతి ఘాట్ వద్ద పుణ్యస్నానం ఆచరిస్తున్న గవర్నర్ దంపతులు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం సరస్వతి పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానం ఆచరించారు. 11.02నిమిషాలకు హెలీకాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్నారు. ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌కరే పుష్పగుచ్ఛం అందించి గవర్నర్ దంపతులకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ ద్వారా గోదావరి నదికి చేరుకుని పుష్కరస్నానం ఆచరించారు. అనంతరం సరస్వతి విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులను మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ సన్మానించి సరస్వతిదేవి జ్ఞాపికను అందజేశారు. 12.03 నిమిషాలకు పుష్కర ఘాట్ నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో ఆలయానికి వెళ్లారు.

మంత్రి దుద్దిళ్ల దంపతుల పుణ్యస్నానం..

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సతీమణి శైలజా రామయ్యర్‌తో కలిసి సరస్వతి పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానం ఆచరించారు.

ప్రముఖుల పుణ్యస్నానం..

కాళేశ్వరం సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని ప్రముఖులు ఆదివారం త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానం ఆచరించారు. గడ్చిరోలి ఎంపీ నామ్ దేవరావు కిరసాన్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి, ఆదిలాబాద్ ప్రాంతానికి చెందిన మోగనందం సరస్వతి పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలను ఆచరించారు.

108 లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాల్లో భాగంగా పలు సంస్థలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తూ భక్తులకు ఉపదేశాలు చేస్తున్నాయి. కాళేశ్వర క్షేత్రంలోని నిర్మల గౌతామాశ్రమంలోని 108 లింగాలతో కూడిన ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో శతచండీ విశ్వశాంతి మహాయాగం వైభవంగా నిర్వహిస్తున్నారు.

పలువురు పుష్కర భక్తులు పుణ్య స్నానాల అనంతరం 108 లింగాల వద్ద పూజలు చేసి చల్లగా ఉండాలని మొక్కుకుంటున్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరస్నానం ఆచరించేందుకు ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత కాళేశ్వరం రానున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు త్రివేణి సంగమం వద్ద ఏర్పాటు చేసన సరస్వతి పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానం ఆచరించి కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు.

ప్రశాంతంగా దేవుడిని దర్శించుకోండి

- భక్తులతో ముచ్చటించిన మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానం చేశారా.. ఇక ప్రశాంతంగా కాళేశ్వర-ముక్తీశ్వర స్వామిని దర్శించుకోండి.. అంటూ పలువురు భక్తులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పలకరించారు. శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం వెలుపల గవర్నర్ వస్తున్న సమయంలో భక్తులను కొద్దిసేపు నిలిపివేయడంతో దర్శనాల కోసం వేచి చూస్తున్న వారితో మంత్రి శ్రీధర్‌బాబు మాట ముచ్చట చేస్తూ కరచాలనం ఇచ్చారు. పలువురు మహిళా భక్తులు, యువకులు మంత్రితో కరచాలనం చేయడానికి ఉత్సాహం చూపారు.

రైతులకు పుష్కర 'ఉపాధి'



ఎడ్లబండిలో భక్తులను తీసుకెళ్తున్న రైతులు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర సరస్వతి పుష్కరాలలో రైతులకు ఉపాధి లభించింది. పుష్కర ఘాట్‌కు కొంత దూరంలోనే వాహనాలు నిలిపివేయడంతో అక్కడి నుంచి భక్తులు పుష్కర ఘాట్ వరకు నడవాల్సి వస్తుంది. గమనించిన కాళేశ్వరం, చుట్టుపక్కల గ్రామాల రైతులు ఘాట్ వరకు ఎడ్లబండ్లలో భక్తులను చేరవేస్తూ ఉపాధి పొందుతున్నారు. పర్ హెడ్ రూ.100 తీసుకుంటూ భక్తులను పుష్కర ఘాట్ వద్దకు చేరవేస్తున్నారు. వేసవిలో ఖాళీగా ఉంటున్న రైతులకు మంచి ఉపాధిగా మారింది.

పుష్కరాల్లో 'గిరి'జన మధురం

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కర స్నానాలకు, కాళేశ్వర-ముక్తీశ్వరుడి దర్శనానికి విచ్చేస్తున్న వేలాది మంది భక్తులకు నిత్యావసరాలతో పాటు సహజసిద్ధంగా తయారు చేసిన పదార్థాలను ప్రభుత్వ రంగ సంస్థలతో విక్రయాలు చేస్తున్నారు. కాళేశ్వరం గ్రామంలో ఆలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని జీసీసీ మహదేవపూర్ శాఖ ద్వారా ఆదివాసీ గిరిజనులు అడవుల్లో సేకరించిన అతి మధురమైన తేనెను బాటిళ్లలో నింపి ప్రత్యేకంగా విక్రయాలు చేస్తున్నారు. గిరి బజార్ పేరిట స్టాల్ ఏర్పాటు చేసి కిలో తేనె రూ.400, అర కిలో తేనె రూ.200లకు బాటిళ్లను విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పుష్కర క్షేత్రం.. గోమాతకు పశుగ్రాసం..

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానం చేసి తమ ఇబ్బందులు తొలగాలని వచ్చే వేలాది మంది భక్తులు పలు సేవా కార్యక్రమాలు చేసి పుణ్యం గడించాలని కోరుకుంటున్నారు. దీంతో పలువురు గోమాతలను ప్రధాన పుష్కర ఘాట్‌లో ఉంచి పచ్చిగడ్డిని భక్తులు తినిపించేలా ప్లాన్ చేశారు. దీంతో కొందరు భక్తులు డబ్బులు చెల్లించి పశుగ్రాసం కొని గోమాతలకు తినిపించి మొక్కుకుంటున్నారు.

అన్నదానం.. మహాదానం..!

- పుష్కర భక్తులకు భోజనాలందించిన పలు సంస్థలు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : అన్నదానం.. మహాదానం అంటూ పలు సంస్థలు, పలువురు వ్యక్తులు తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే వేలాది మంది భక్తులు, భక్తులకు సేవలందించే వారికి ఉచితంగా భోజనం అందించి తమ సేవాతత్పరతను చాటుకుంటున్నారు. కాళేశ్వరం క్షేత్రంలోని శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులతో పాటు వివిధ సంస్థలు, వ్యక్తులు కలిసి పలు చోట్ల నిత్యం సుమారు 30 వేల మందికి పైగా భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. పలు ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ, హైదరాబాద్‌కు చెందిన తత్వమసి సంస్థ, శైవక్షేత్ర పీఠం, శివశక్తి క్షేత్రం, ఈశ్వరిమాతసత్రం, నిర్మలాశ్రమం, బ్రాహ్మణ సత్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు పుష్కర భక్తులకు అల్పాహారం, భోజనం అందిస్తున్నారు. ఆలయ అధికారులు సైతం నిత్యం వందలాది మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు నిత్యం 10వేల మందికి భోజనాలు పెడుతూ తమ సేవాతత్పరతను చాటుకుంటున్నారు. పలు సంస్థలు ఎన్నో ఇబ్బందులు ఉన్నా వర్షంలో కూడా భక్తులకు భోజనాలు అందిస్తున్నాయి. ఇలా పలుసంస్థలు, పలువురు దాతలు పుష్కర భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తుండటంతో తృప్తిగా భోజనం చేసి అన్నదాత సుఖీభవ అంటూ కోరుకుంటున్నారు.

కాళేశ్వరం లడ్డూ ప్రసాదం కమనీయం

- 220 మంది మహిళలు, పురుషులు తయారీలో నిమగ్నం



లడ్డూలు ప్యాకింగ్ చేస్తున్న మహిళా భక్తులు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రం త్రివేణి సంగమంలో అంతర్వాహిని నదీమాత సరస్వతి పుష్కరాలతో భక్త జనసంద్రంగా తలపిస్తోంది. పుష్కర పుణ్య స్నానాలకు నిత్యం లక్షకు పైగా భక్తులు వస్తుండటంతో ఇసుకేస్తే రాలని భక్తజనంతో సందడిగా మారింది. పుణ్యస్నానాలు చేసిన వేలాది మంది భక్తుల్లో చాలా మంది శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరస్వామి, శుభానందదేవిని దర్శనంచేసుకుని లడ్డూ మహాప్రసాదాన్ని కొనుక్కుని ఇళ్లకు వెళ్తున్నారు. పుష్కరాల సమయంలో లడ్డూ రుచి కమనీయంగా ఉందని, నాణ్యత బాగా ఉందంటూ లడ్డూలను అధికంగా కొనుగోలు చేయడం కనిపిస్తోంది. లడ్డూలకు భలే గిరాకీ ఉండటంతో అధికారులు భక్తులకు ప్రసాదం అందించడంలో తలమునకలైనా ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం 40-50వేల వరకు లడ్డూలు తయారు చేసినా భక్తులకు సరిపోను అందడం లేదని చెబుతున్నారు.

220 మందితో లడ్డూల తయారీ

సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరుడి ప్రసాదం లభించేలా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. పుష్కరాల సేవకు వచ్చిన 120 మంది మహిళా భక్తులు, 60 మంది స్థానిక మహిళలు, 20 మంది మహారాష్ట్రకు చెందిన మహిళలు, లడ్డూలను కౌంటర్లకు చేరవేసే 20 మంది పురుషులను ఆలయ అధికారులు లడ్డూల తయారీలో నిమగ్నం చేశారు. నిత్యం పది క్వింటాళ్ల లడ్డూలు(40-50వేలు), పది క్వింటాళ్ల పులిహోర (20-25వేల ప్యాకెట్లు) తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. కాగా, నిత్యం 220 మంది వ్యక్తులు లడ్డూలు తయారు చేసినా భక్తులకు అందడం లేదు. లడ్డూల విక్రయాల కౌంటర్ల వద్ద నిత్యం టికెట్లు తీసుకున్న భక్తులు వాటి కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఆలయ అధికారులు వేములవాడ, యాదగిరిగుట్ట, కొమురవెల్లి, భద్రకాళి ఆలయాల లడ్డూలు తెచ్చి విక్రయాలు జరిపారు. అక్కడి లడ్డూల ధరలు రూ.30 ఉండగా భక్తులు అధికారులతో రూ.20కే అంటూ వాగ్వాదాలకు దిగారు.

యథేచ్ఛగా మూగజీవాల అక్రమ రవాణా

- జిల్లాలో ఆగని మూగ రోదన
- సరిహద్దుల నుంచి భారీ ట్రక్కుల్లో తరలింపు
- కేసులు నమోదు చేస్తున్నా ఆగని అక్రమం
- రూటు మార్చిన కేటుగాళ్లు



కంటైనర్‌లో మూగజీవాలను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

ములుగు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సరిహద్దు ప్రాంతం కావడంతో మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసుల కళ్లు కప్పి భారీ కంటైనర్లలో పెద్ద మొత్తంలో అర్ధరాత్రుళ్లు పశువులను తరలిస్తున్నారు. పరిమితికి మించి మూగ జీవాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటే మూగరోదన ఎవరీ పట్టడం లేదా..అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పోలీసులు అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నప్పటికీ కేటుగాళ్లు రూటు మార్చి మరీ మూగ జీవాలను అనుకున్న గమ్యానికి తరలిస్తున్నారు. పటిష్ఠ నిఘా పెట్టి అక్రమార్కుల ఆట కట్టించి మూగజీవాల రోదనకు చెక్ పడేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సరిహద్దుల నుంచి ట్రక్కుల్లో తరలింపు

భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల నుంచి ములుగు జిల్లా వెంకటాపురం,వాజేడు, ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట, ములుగు మండలాల మీదుగా మూగజీవాల అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. భారీ కంటైనర్లు,డీసీఎం,బొలేరో వాహనాల ద్వారా పశువులను అక్రమార్కులు హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా అర్ధరాత్రుళ్లు పోలీసుల కళ్లు గప్పి చేస్తుండడంతో దొరికినప్పుడే వారు కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి సమయాల్లో పోలీసులు నిఘా పెంచితే మూగజీవాల అక్రమ రవాణాకు చెక్ పడుతుందని చెబుతున్నారు.

నిబంధనలకు తూట్లు..

పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే పలు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మూగ జీవాలను రవాణా చేసే ముందు సంబంధిత ఆర్టీవో అనుమతి పొందిన వాహనాలలో రవాణా చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక లైసెన్స్ కలిగిన వాహనాలలో మాత్రమే మూగ జీవాలను తరలించాలి. ఆ వాహనాల్లో ప్రత్యేక క్యాబిన్ ఉండేలా చూసుకోవాలి. పశువుల తరలింపునకు స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జారీ చేసిన సర్టిఫికెట్ తప్పనిసరి. అయితే పలువురు అక్రమార్కులు అవేం పట్టనట్లుగా నిబంధనలను తుంగలో తొక్కుతూ మూగ జీవాలను యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. గడిచిన ఐదు నెలల్లో ఏటూరునాగారం పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 169 మూగజీవాలను రక్షించి 10 కేసులు నమోదు చేసి, 26 మందిని అరెస్ట్ చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో గట్టి బందోబస్తు నిర్వహించి అక్రమార్కుల ఆటకట్టించి మూగజీవాల రవాణాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

రూటు మారుస్తున్న కేటుగాళ్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మీదుగా ములుగు మండలం నుంచి మూగజీవాలను అక్రమ రవాణా చేస్తున్న క్రమంలో పోలీసులు నిఘా పెట్టడంతో కేటుగాళ్లు రూటు మార్చి తరలిస్తున్నారు. చర్ల మీదుగా వచ్చిన వాహనాలను వాజేడు మండలంలోని ముల్లకట్ట బ్రిడ్జి పైనుంచి రొయ్యూరు, కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం నుంచి ముకునూరు మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారని సమాచారం. అలాగే కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం నుంచి ముకునూరు మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం మీదుగా కాటారం చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. అయితే సరిహద్దు జిల్లాల పోలీసులు గట్టి నిఘాపెడితే అక్రమార్కుల ఆట కట్టించ వచ్చని జంతు ప్రేమి కులుచెబుతున్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం బోల్తా

- ఎనిమిది పశువులు మృతి

వెంకటాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడగా 8 పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో కొందరు వ్యక్తుల నుంచి 14 పశువులను డీసీఎం వాహనంలో అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనం వెంకటాపురం మండలంలోని రాచపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 8 పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. మిగిలిన ఆరు పశువులను పోలీసులు స్వాధీనం చేసుకొని భూపాలపల్లి జిల్లాలో గల గోశాలకు తరలించారు. కాగా, పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులు అర్జున్, బాలకృష్ణ, మహమ్మద్ గౌస్‌లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.



వాహనం బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన పశువులు

వాడ బలిజలు ఉద్యమాలకు సిద్ధం కావాలి

మంగపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : వాడ బలిజ కులస్థులు తమ హక్కులు, సంక్షేమ పథకాలు సాధించుకొనుటకు ఐక్య ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని వాడ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్ర దామోదర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని వాడ బలిజ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం జెండాను దామోదర్ ఎగురవేసి మాట్లాడారు. సంఘం ప్రారంభమై 25 సంవత్సరాలైందని, రాబోయే రోజుల్లో ఐక్యతతో కలిసి ఉండాలన్నారు. తమ కులానికి వచ్చే హక్కులను కోల్పోతున్నామని ప్రతి ఒక్క వాడబలిజ కులస్థుడు సభ్యత్వం విధిగా తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందాల్సిన సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అందరు పార్టీలకు అతీతంగా కలిసి కులం అభివృద్ధికోసం పాటుపడాలని దామోదర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గార ఆనంద్ తోట మల్లికార్జున్, మంగపేట మండల అధ్యక్షుడు గగ్గూరి రాంప్రసాద్ వాజేడు మండల అధ్యక్షుడు బొల్లె ఆదినారాయణ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుంది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలుచేస్తుందని, రైతులు ఎవ్వరు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని చెల్పూర్, బస్వరాజ్‌పల్లి, గొల్లపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సివిల్ సప్లయిూస్ అధికారులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సివిల్ సప్లయిూస్, ట్రాన్స్‌పోర్టు, మిల్లర్ల యజమానులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెండురోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలి : బీఎస్పీ

కాటారం: అకాల వర్షాలతో తడిసిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్, అధ్యక్షుడు రాజబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీఎస్పీ నాయకులు ఆదివారం సందర్శించారు. వర్షాలతో తడిసి మొలకెత్తిన వడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వడ్లు పోసి 20 రోజులకు పైగా గడుస్తున్నా తేమశాతం 17లోపు ఉన్నా కాంటాలు పెట్టలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను సందర్శించి వడ్లను కాంటాలు పెట్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకుడు ఏట సంపత్, రైతులు తదితరులు ఉన్నారు.



చెల్పూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మోడికుంటకు మోక్షం..

(5వ పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టుకు 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంతి వైఎస్ రాజశేఖర రెడ్డి అనుమతులు మంజూరు చేశారు.

ఆది నుంచి అడ్డంకులే..

మోడికుంట ప్రాజెక్టు నిర్మాణంకు 2005లో అనుమతులు వచ్చినప్పటికి పనులు మాత్రం మొదలు కాలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీ శాఖ మోకాలడ్డు వేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా అటవీ శాఖకు చెందిన భూములు కోల్పోతుండటంతో అటవీశాఖ నిర్మాణంకు అనుమతులు ఇవ్వలేదు. ఆ తొలిదశ అనుమతులు 2008లో వచ్చాయి. నాటి నుంచి రెండో దశ అనుమతులు రావాల్సి ఉండగా ప్రస్తుతం అటవీ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.60 కోట్లను చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

2005లో ప్రాజెక్టు నిర్మాణ పనులను దక్కించుకున్న గామన్ ఇండియా కంపెనీ ప్రాజెక్టును మొదలు పెట్టేందుకు అన్ని చర్యల్ని చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణంకుఅవసరమయ్యే ఇసుక, ఇతర భారీ యంత్రాలను తరలించి పనులను మొదలు పెడదామని అనుకున్న సమయంలో అటవీశాఖ అభ్యంతరం చెప్పడంతో ఇసుక, ఇతర భారీ యంత్రాలను అక్కడే వదిలేసి వెళ్లిపోవడంతో ఆ యంత్రాలు సైతం ప్రస్తుతం తుప్పుపట్టి పనికిరాని దశలో ఉన్నాయి.

2018లో ప్రజాభిప్రాయ సేకరణ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వాజేడు మండలంను 2016లో మొదట భూపాలపల్లి జిల్లాలో, ప్రస్తుతం ములుగు జిల్లాలో విలీనం చేశారు. 2018లో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభను ఏర్పాటు చేసి గిరిజనులు, గిరిజనేతరుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రాజెక్టు నిర్మాణంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడంతో 2019లో పర్యావరణ అనుమతులు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. కానీ, రూ. 100 కోట్లను మాత్రం విడుదల చేయలేదు.

2023లో సీడబ్ల్యూసీ ఆమోదం

ప్రాజెక్టు నిర్మాణంకు సంబంధించి 2023లో మోడికుంట డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపినట్లు గోదావరి బోర్డు వెల్లడించింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణంకు అన్ని అనుమతులు వచ్చినప్పటికి ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తికాలేదు.



తుప్పు పట్టిన వాహనం (ఫైల్)

పెరిగిన అంచనా వ్యయం

మోడికుంట వాగు ప్రాజెక్టు అంచనా వ్యయం ఏళ్లు గడుస్తున్న కొద్ది పెరుగుతూ పోతుంది. 2005లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.100 కోట్లు కాగా ప్రాజెక్టు పనులు మొదలు కాకపోవడంతో నిలిచిపోయాయయి. అనంతరం 2018లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.425.16 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం 2021-22 లెక్కల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.524కోట్లుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.718 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

13వేల ఎకరాలకు సాగునీరు

ప్రాజెక్టు నిర్మాణం జరిగితే వాజేడు మండలంలోని 35 గ్రామాలలో 13వేల ఎకరాలకు ఒకేసారి సాగునీరు ఇవ్వవచ్చని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం సామర్థ్యం 2.142 టీఎంసీలు. దీంతో ఖరీఫ్‌లో 10వేల ఎకరాలు, రబీలో సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. అదే విధంగా ప్రాజెక్టు నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుతుండటంతో తాగునీటి ఇబ్బందులు కూడా వచ్చే పరిస్థితులు ఉండవని అధికారులు తెలుపుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో వాజేడులో ఎక్కువగా వరి, మిర్చి పంటలకు పుష్కలంగా సాగునీరు అంది పంటలు దిగుబడులు వచ్చే ఆస్కారం ఉండటంతో రైతులు ఆర్థికంగా పుంజుకునే ఆస్కారం ఉంది. పూర్తి ఆదివాసీ ప్రాంతం కావడంతో ఆదివాసీల జీవన విధానంలో మార్పులు వచ్చే ఆస్కారం ఉందని స్థానికులు వాపోతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మొగుళ్లపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం తెల్లవారుజామున ప్రభుత్వ ఉపాధ్యాయుడికి చెందిన ట్రాక్టర్ ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆర్ఐ శివరామకృష్ణ తెలిపారు. హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన సాంబశివరావు అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు మండలంలోని వేములపల్లి పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిత్యం ట్రాక్టర్ల ద్వారా పరకాల పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్నాడన్నారు. కాగా, తహసీల్దార్ సునీత ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో రెవెన్యూ సిబ్బందితో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆర్ఐ పేర్కొన్నారు. సాంబశివరావు మొగుళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడని చెప్పారు.

కాళ్లు కడిగాకే ఆలయంలోకి గవర్నర్

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాల సందర్భంగా 11వ రోజున రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పుష్కరిణిలో పుణ్యస్నానం చేసి శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట గవర్నర్ దంపతులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ చిరుద్యోగుల్లో ఒకరు గవర్నర్ కాళ్లపై నీళ్లు పోసి కడుక్కున్న అనంతరం అధికారులు ఆలయంలోకి పూర్ణకుంభ స్వాగతంతో తీసుకెళ్లారు.

20 మందికి పైగా అస్వస్థత

- పీహెచ్‌సీ వైద్యశిబిరంలో చికిత్స అందించిన వైద్యులు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలకు వస్తున్న భక్తులకు మండుతున్న ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. ఆదివారం సైతం పలువురు భక్తులు డీ హైడ్రేషన్, గిడ్డీనెస్, విరోచనాలతో కూడిన అస్వస్థతతో వైద్య శిబిరాల్లో చికిత్స పొందారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధాన వైద్య శిబిరంలో పుష్కరాల 11వ రోజున ఇన్‌పేషంట్ల తాకిడి నెలకొంది. శిబిరంలో 34 మంది ఇన్‌పేషంట్లకు చికిత్సనందించగా వారిలో 20 మందికి పైగా డీహైడ్రేషన్ సమస్యతో అడ్మిట్ అయ్యారని వైద్యులు తెలిపారు.

తోపులాటలో బస్సు టైరు ఎక్కి భక్తుడికి గాయాలు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర క్షేత్రంలో సరస్వతి పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ వద్ద భక్తుల రద్దీ ఎక్కువై బస్సు కోసం ప్రయాణికుల మధ్య ఆదివారం సాయంత్రం తోపులాట చోటుచేసుకుంది. దీంతో తోపులాటలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన రమేష్ కాలుపై నుంచి వరంగల్‌కు చెందిన బస్సు టైరు వెళ్లడంతో తీవ్రగాయమై భారీగా రక్తస్రావం అయింది.

అక్కడే ఉన్న 108 అంబులెన్స్‌లో కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అడ్మిట్ చేశారు. బస్టాండ్ వద్ద భక్తుల రద్దీని నియంత్రించడానికి ఆర్టీసీ అధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో చేసుకోవాలి

మంగపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య(యూనికోడ్) కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని మండల వ్యవసాయాధికారి నేదునూరి చేరాలు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు కల్పించే పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడుత రూ.2వేలు తమ బ్యాంక్ ఖాతాలో జమ కావాలంటే కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. భూమి(రెవెన్యూ) పట్టా ఉన్న ప్రతి రైతు ఈ-ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేసుకోవాలని సూచించారు. మంగపేట రైతు వేదికలో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 31 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో చేరాలు కోరారు.

'మావోయిస్టులతో ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలి'

ఏటూరునాగారం, మే 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో ప్రభుత్వాలు వెంటనే శాంతి చర్చలు జరపాలని, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని ఆదివాసీ మహిళా ములుగు జిల్లా నాయకురాలు కొప్పుల సరిత ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రంగా మండిపడ్డారు. కాగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల్లో అటవీ బిడ్డలైన ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్న ప్రభుత్వాల పనితీరుపై ధ్వజమెత్తారు. కర్రెగుట్టలపై జరుగుతున్న కగార్ ఆపరేషన్‌ను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు, ఉద్యమకారులు కేంద్ర ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తూనే ఉన్నారని స్పష్టం చేశారు. పాకిస్తాన్-ఇండియా మధ్యలో యుద్ధం జరుగుతుంటే, ఆ యుద్ధాన్ని ఆపి శాంతి చర్చలు జరిపిన ప్రభుత్వాలకు, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ఎందుకు భయపడుతుంతోంది..? అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలీస్‌శాఖ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టులను నిర్మూలించేంత వరకు నిద్రపోనంటూ వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా, బూర్జువా వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం తప్ప వేరే మార్గం లేదని పునరుద్ఘాటించారు.